క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి


పార్టీలో చేరిన వారితో కేతిరెడ్డి రమాదేవి

తాడిపత్రిరూరల్: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి సతీమణి రమాదేవి కోరారు. పట్టణంలోని ఓం శాంతి నగర్‌లో శనివారం ఆమె ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజల జీవితాలు బాగుపడ్డాయన్నారు. తాడిపత్రిలో ప్రశాంతత కోసం ఎమ్మెల్యే పెద్దారెడ్డి కృషి చేశారన్నారు. టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే సతీమణి రమాదేవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో హాజీ, వేణు, రాజు, శారద సత్తెమ్మ, బాలగౌరి, రమాదేవి తదితర కుటుంబాలున్నాయి.

చింతమనేనిపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

తాడిపత్రిరూరల్: ప్రచారంలో దళితులపై టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ దాడికి దిగడం అమానుషమని వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత సంఘాల నాయకులు నాగభూషణం, మనోజ్ కాశీం, గురుశంకర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ దళితులంటే చింతమనేనికి చులకన భావమన్నారు. దాడితో ఐదుగురు దళితులు గాయపడ్డారన్నారు. దాడికి పాల్పడ్డ చింతమనేనిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ ఓడిపోతుందన్న సర్వేలను తట్టుకోలేక దాడులకు తెగబడుతున్నారన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి


27వ వార్డులో ప్రచారం చేస్తున్న మైనార్టీ నాయకుడు, కౌన్సిలర్ ఫయాజ్‌బాషా

తాడిపత్రి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్నకు మరోసారి ముఖ్యమంత్రిగా పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ 2వ వార్డు కౌన్సిలర్, సీనియర్ మైనార్టీ నాయకులు హీరాపురం ఫయాజ్‌బాషా కోరారు. శనివారం ఆయన 200 మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని 27వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని, ఎంపీగా శంకర్ నారాయణను గెలిపించాలని కోరారు. పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. కేతిరెడ్డి పెద్దారెడ్డితోనే తాడిపత్రి అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీకి ఓటు వేస్తే రాష్ట్రం సర్వనాశనం కావడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ వలి, వైస్ చైర్మన్ చిచ్చా మాబాషా, నాయకులు రియాజ్, వలి, ముస్లింలు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి


కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ, జవాన్లు

యల్లనూరు: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని, ఫ్యాక్షను ప్రభావిత గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలతో పాటు చట్టవ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలకేంద్రంలో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లను తనిఖీ చేశారు. ఎవ్వరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే జైలుకు పంపుతామన్నారు. అనంతరం బీయస్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గిరిబాబు, ఏఎస్‌ఐ సంపత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

తాడిపత్రిరూరల్: పట్టణంలోని సంజీవనగర్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కొత్తపల్లి రామ్మోహన్‌రెడ్డి మాతృమూర్తికి శనివారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాళులర్పించారు. ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రగతి పరుగులు


రూ.24 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి


రూ.20 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం


500 పడకల కరోనా ఆసుపత్రి (ఫైల్)

- అభివృద్ధి పథంలో తాడిపత్రి
- రూ. 3,300 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి
- కరోనా సమయంలో రాయలసీమలో తలమానికంగా 500 పడకల ఆక్సిజన్ తాత్కాలిక ఆస్పత్రి
- 40 ఏళ్లలో సంక్షేమాన్ని విస్మరించిన జేసీ కుటుంబం
- సీఎం జగన్‌కు అండగా ఉంటామన్న నియోజకవర్గ ప్రజలు

తాడిపత్రిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జయహో తాడిపత్రి అన్న రీతిలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగింది. 40 ఏళ్లల్లో జేసీ కుటుంబం చేయలేని అభివృద్ధి కేవలం ఐదేళ్ల కాలంలో జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాడిపత్రి అంటే ప్రత్యేక అభిమానం. అందుకు రూ.1,806 కోట్ల సంక్షేమం, రూ.1,547 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి సైతం ప్రత్యేక చొరవ చూపించారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్రగా చెప్పుకునే జేసీ కుటుంబం తాడిపత్రి ప్రాంత వాసుల కలగా మిగిలిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణంపై మీనమేషాలు లెక్కించడంతో వచ్చిన కోట్లాది రూపాయల నిధులు తిరిగి వెళ్లాయి. మూడు జిల్లాలకు కేంద్రంగా ఉన్న ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.24 కోట్లను విడుదల చేసి ప్రజల కలను నిజం చేశారు. కరోనా కాలంలో వందలాది మంది సరైన వైద్యం అందక లక్షలాది రూపాయలను ఖర్చు చేసుకుంటున్నారని తెలిసిన ముఖ్యమంత్రి కోట్లాది రూపాయల వ్యయంతో తాడిపత్రి మండలం స్టీల్ వద్ద 500 పడకల ఆక్సిజన్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలతో జయహో జగన్ అనిపించుకున్నారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిలో భాగంగా రూ.885 కోట్లతో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి. రూ.738.82 కోట్లతో ముచ్చుకోట నుంచి బుగ్గ వరకూ, రూ.78 కోట్లతో తాడిపత్రి నుంచి బొందలదిన్నె, రూ.69 కోట్లతో గంగాదేవిపల్లి నుంచి బుగ్గ వరకూ రోడ్డు పనులు చేస్తున్నారు. రూ.72 కోట్లతో నియోజక వర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణం, రూ.117 కోట్లతో వివిధ పథకాల కింద రోడ్లు, కాలువల నిర్మాణం, నాడు-నేడు కింద 44.16 రూ.కోట్లతో 168 పాఠశాలల అభివృద్ధి, రూ.రెండు కోట్లతో తాడిపత్రి పట్టణంలోని అంబేడ్కర్ నగర్, పాతకోటలో హెల్త్ సెంటర్ల నిర్మాణం చేపట్టారు. రూ.21 కోట్లతో ఉర్దూ రెసిడెన్సియల్ స్కూల్, రూ.4.3 కోట్లతో వంద పడకల బాల, బాలికల హాస్టళ్ల నిర్మాణం, రూ.18 కోట్లతో మహిళల పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం, రూ.1.35 కోట్లతో ఉమ్మడి సేవా కేంద్రం నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. రూ.110 కోట్లతో ముచ్చుకోట, భోగాలకట్ట, వీరాపురం గ్రామాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడమే కాక రైతులందరికి 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ చేశారు. రూ.10 కోట్లతో చాగల్లు ఫ్లడ్ కెనాల్ పునరుద్ధరణ పనుల వల్ల పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాలకు సాగు తాగునీటిని అందించవచ్చు. సొంత నిధులతో ఎమ్మెల్యే పెద్దారెడ్డి ముచ్చుకోట రిజర్వాయర్, రాయలచెరువుల్లోని ముళ్లకంపలు తొలగించి రైతులకు సాగునీరందించారు.

జేసీ దుష్ట ఆలోచనతో..

ముచ్చుకోటలో జేసీ కుటుంబానికి గనులున్నాయి. రిజర్వాయర్‌ను నీటితో నింపడం వల్ల గనుల్లోకి నీరు వస్తుందన్న దుష్ట ఆలోచనతో వారు పట్టించుకోక పోవడంతో రైతులు సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి చొరవతో ఐదేళ్లుగా రిజర్వాయర్‌ను నీటితో నింపడం వల్ల వారి కళ్లల్లో వెలుగు నింపారు. రూ.42.72 కోట్లతో 61 గ్రామ సచివాలయాల నిర్మాణం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణం జరిగింది. రూ.44.16 కోట్లతో గ్రామాల్లో తాగునీటి నిర్మాణపు పనులు చేపట్టారు. రూ.13 కోట్లతో మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో సిమెంట్ రోడ్లు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. అమృత్ స్కీం కింద రూ.65 కోట్ల నిధులను ఎమ్మెల్యే పెద్దారెడ్డి తీసుకువచ్చిన వాటి పరిపాలన అనుమతులకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుపడుతున్నారు. జేసీ వ్యవహారంపై పలుమార్లు ఎమ్మెల్యే మండిపడ్డా ఆయనలో చలనం లేదు. రూ.64 కోట్లతో 15 ఎంపీఎఫ్‌సీ గొడౌన్ల నిర్మాణం చేట్టారు. రూ.5.15 కోట్లతో జలకళ పథకం ద్వారా రైతులకు ఉచిత బోర్లు, మోటర్ల పంపిణీ చేశారు. రూ.70 లక్షల వ్యయంతో పెన్నానది తీరాన సజ్జలదిన్నె సమీపంలో వైఎస్సార్ గ్రామీణ పార్కు ఏర్పాటు చేశారు. నియోజవర్గంలో విద్యాదీవెన, వసతి దీవెన కింద 15,870 మంది విద్యార్థులకు రూ.90.34 కోట్లు ఖర్చు చేశారు. అమ్మవడి, గోరుముద్ద, విద్యాకానుక కింద 24,289 మంది విద్యార్థులు, 7,000 మంది గర్భిణులకు రూ.158.31 కోట్లు పంపిణీ చేశారు. 2019 ఏప్రిల్ 11 వరకూ 5116 డ్వాక్రా గ్రూపులకు రూ.25 వేల కోట్ల బకాయిలు చెల్లించారు. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ ద్వారా 8,700 మంది అక్కచెల్లెమ్మలకు రూ.132 కోట్ల లబ్ధి చేకూర్చారు. వైఎస్సార్ చేయూతలో 8,263 మందికి, ఈబీసీలో 8,973 మంది, కాపు నేస్తంలో 3,134 మందికి రూ.26.43కోట్ల లబ్ధి చేకూర్చారు.55,846 మంది పెన్షన్ల దారులకు రూ.565.75 కోట్లు, 12,823 మందికి రూ.232 కోట్ల విలువైన పట్టాల పంపిణీ, 86,000 మంది రేషన్‌కార్డుల కుటుంబాలకు రూ.183 కోట్లు, నేతన్న నేస్తంలో 5,867 మందికి రూ. 55.67 కోట్లు, ఆరోగ్యశ్రీ లో 11,200 మంది రోగులకు రూ.85 కోట్ల వైద్య సేవలు అందాయి. రైతు భరోసా కింద 74,000 మంది రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, 20,000 మందికి సున్నావడ్డీ, 62,000 మందికి రాయితీ విత్తన సరఫరా, 37,000 మందికి రూ.232.52 కోట్ల సాయం అందించారు. వైఎస్సార్ బీమాలో 432 కుటుంబాలకు రూ.7.23 కోట్ల సాయం, ముఖ్యమంత్రి సహాయనిధిలో 653 మందికి రూ.10 కోట్ల పంపిణీ, జగనన్న చేదోడులో 2,070 మందికి రూ.6.43 కోట్లు, వాహనమిత్రలో 6,747మందికి రూ.14.27 కోట్లు అందించారు. కోవిడ్ సమయంలో 67,000 కుటుంబాలకు రూ.6.7 కోట్ల ఆర్థిక సాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి


మండల సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

పెద్దవడుగూరు: తాగునీటి సమస్యలపైన ప్రత్యేక దృష్టి పెట్టామని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ సూర్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రెండో ఉప మండలాధ్యక్షురాలు పద్మావతమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభించారు. 25 పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. ఎవ్వరూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించరాదన్నారు. ఉపాధి కూలీలు సకాలంలో కూలి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రికెట్ కోచింగ్

తాడిపత్రి: వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని, ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ శిబిరంనిర్వహించనున్నట్లు కోచ్ భార్గవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడిపత్రి జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మే 1 నుంచి 21వ తేదీ వరకూ నిర్వహించే క్రికెట్ శిక్షణను ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో క్రికెట్ శిక్షణ ఉంటుందన్నారు. 8-16 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఫోన్ 9347640651,9059969794 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

నేడు వీరాంజనేయులు పర్యటన

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి, కొర్రపాడు, నీలారెడ్డి, చెన్నంపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు మన ఊరికి మన వీరా కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ అంకే నరేష్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు మండలంలోని రెడ్డిపల్లిలో ప్రచారం ప్రారంభిస్తారన్నారు. అనంతరం కొర్రపాడు, నీలారెడ్డిపల్లి, చెన్నంపల్లిలో ప్రచారం కొనసాగుతుందన్నారు. ప్రచారం అనంతరం వీరాంజనేయులు చెన్నంపల్లిలో రాత్రికి పల్లె నిద్ర కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం


సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లపై నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను ఎమ్మెల్యే పెద్దారెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. జిల్లాలో సిద్ధం సభ, బస్సుయాత్రల తరువాత ఆదివారం తాడిపత్రిలో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. భారీ జన సమీకరణతో ముఖ్యమంత్రి వద్ద మరోసారి తానేమిటో నిరూపించుకోవాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే ఉన్నారు. ఇందుకోసం తాడిపత్రి నియోజక వర్గం నాయకులు, ద్వితీయ శ్రేణులతో చర్చలు జరుపుతున్నారు. అందుబాటులో వున్న వారిని కార్యాలయానికి పిలిపించుకుంటున్నారు. మిగిలిన వారితో ఫోన్ మాట్లాడుతున్నారు. పెద్ద ఎత్తున జనాలను సమీకరించి బహిరంగసభకు తీసుకురావాలని సూచిస్తున్నారు. 2019 ఎన్నికల సందర్భంగా తాడిపత్రికి వచ్చిన ముఖ్యమంత్రి జేసీ సోదరులపై విరుచుకు పడ్డారు. తాడిపత్రిలో ప్రశాంతత నెలకొనాలంటే పెద్దారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి అన్నట్టుగానే పెద్దారెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అరాచకాలు, అక్రమాలతో ఫ్యాక్షన్ రాజకీయాలు చేసిన జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధిపత్యానికి ప్రజలు చరమ గీతం పాడారు. 40 ఏళ్లుగా తాడిపత్రి ప్రజలను అన్ని రకాలుగా మోసం చేస్తూ అక్రమాలతో లబ్ధిపొందుతున్న జేసీ అవినీతి, అక్రమాల గుట్టు రట్టై జైలుకు సైతం వెళ్లారు. 2024 ఎన్నికలను పురస్కరించుకొని తాడిపత్రికి వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రసంగంపై ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

తాడిపత్రిరూరల్: తాడిపత్రిలో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మైనార్టీ నాయకులు కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం మైనార్టీ నాయకులు జిలాన్‌బాషా, జావెద్, బాబా, ఆయూబ్ బాష, జాకీర్ మాట్లాడుతూ మైనార్టీలందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను కల్పించి ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిదేనన్నారు. ఈ రిజర్వేషన్‌ను రద్దుచేయాలని చంద్రబాబునాయుడు చూశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమానికి కృషి చేసుకోస్తున్నారన్నారు. మైనార్టీలపై ముఖ్యమంత్రి చూపుతున్న ప్రేమను .. అదే స్థాయిలో మేము కూడా జనసమీకరణ ద్వారా చూపిస్తామన్నారు.

యల్లనూరు: తాడిపత్రిలో ఆదివారం జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే సభను విజయవంతం చేయాలని జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు పురుషోత్తంనాయుడు, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనరు వెంకటేష్‌నాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి కోరారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

చెత్త వాగుడు కట్టి పెట్టి నిజాలు తెలుసుకో

- జేసీ పవన్‌పై మండిపడ్డ ఎమ్మెల్యే పెద్దారెడ్డి



తాడిపత్రిరూరల్: తాడిపత్రి అభివృద్ధిని ఎవరు అడ్డుకుంటున్నారో మీ చిన్నాన్నను అడిగితే నిజం తెలుస్తుంది.. రాజకీయ ప్రయోజనాల కోసం చెత్తవాగుడు వాగితే ప్రజలే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జేసీ పవన్ చేసిన అసత్య ఆరోపణలపై మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్‌గా మీ చిన్నాన్నను గెలిపిస్తే రెండు సంవత్సారాలుగా ఏం చేశాడని ప్రశ్నించారు. కనీసం సకాలంలో కౌన్సిల్ సమావేశాలు పెట్టలేని పరిస్థితులో ఉన్నాడన్నారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచడానికి వేలం నిర్వహించకుండా ఆయన వర్గానికి లబ్ధి చేకూర్చడానికి రెండు నెలలు ఎందుకు పొడిగించాడో అడిగి తెలుసుకో అని హితవు పలికారు. వివిధ పథకాల కింద కోట్లాది రూపాయలు నిధులు తీసుకువస్తే టెండర్లు వేయడానికి ఆమోదం తెలపకుండా ఉన్నాడన్న విషయం నీకు తెలుసా అని ప్రశ్నించారు. ఈ నిధుల వల్ల పట్టణంతోపాటు మురికివాడల్లో రోడ్ల నిర్మాణ జరిగేదన్నారు. అమృత్ పథకం కింద దాదాపు 65 కోట్ల రూపాయలను ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తే ఆ పనులు జరగకుండా అడ్డుకున్నాడన్నారు. ఈ పనులు పూర్తయి ఉంటే ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ వచ్చి నీటి సమస్య ఉండేది కాదన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సొంత నిధులతో ట్రాఫిక్ కంట్రోల్ పోలీసు స్టేషన్‌కు ప్రయత్నిస్తే ఎక్కడ నాకు పేరు వస్తుందోనన్న అక్కసుతో కోర్టుకు వెళ్లి అడ్డుకున్నది మీ చిన్నాన్న కాదా అని ప్రశ్నించారు. నాడు-నేడు ధులతో ప్రభుత్వ కళాశాల ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తే అడ్డగోలు మాటలతో అడ్డుకోవడమే కాక కోర్టును ఆశ్రయించాడన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌ను ప్రారంభాన్ని అడ్డుకుని, పేదల వైద్య సేవలకు ఆటంకం కలిగించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పట్టణంలో చెత్త, పారిశుధ్యం గురించి మాట్లాడుతున్న నీకు అసలు నిజం తెలుసా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులు డిమాండ్ సాధన కోసం సమ్మె చేస్తుంటే చైర్మన్‌గా జేసీ చెత్తను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగు పరచాల్సింది పోయి, కార్మికులకు మద్దతు తెలిపి ప్రజలను ఇబ్బందులు పాలు చేశాడన్నారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకుని సొంత ట్రాక్టర్లు పెట్టి పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించానన్నారు. వీటన్నింటిని ప్రజలు గమనిస్తున్నారని, మీ చేతకానితనాన్ని నాపై వేస్తే నమ్మరన్న విషయాన్ని గ్రహించాలన్నారు. వాస్తవాలు తెలిపి జరిగిన తప్పులను మన్నించి ఇకపై మీ కోసం పనిచేస్తామని చెపితే కొంత వరకైనా కరుణిస్తారని జేసీ పవన్‌కు ఎమ్మెల్యే చురకలంటించారు.

జగన్‌తోనే సంక్షేమ పథకాల అమలు


బొందలవాడలో ఎన్నికల ప్రచారంలో వీరాంజనేయులు


బొందలవాడలో వీరాంజనేయులుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

నార్పల: ఎన్నికలకు ముందు నవరత్నాల పథకాల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి ప్రభుత్వం రాగానే ఇచ్చిన మాటను తప్పకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరిచారని శింగనమల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు అన్నారు.శనివారం ఆయన మండలంలోని బొందలవాడ, రంగాపురం, గూగూడు, ముగేత్తిమ్మంపల్లి, జగంరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు.ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు. ముందుగా వారు ఆయా గ్రామాలకు చేరుకోగానే నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాల మధ్య బాణసంచా కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. వారు ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వమన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేసిందన్నారు. 2019లో ఇచ్చిన హామీలను జగనన్న తూచ తప్పకుండా నేరవేర్చారన్నారు.అదే బాటలోనే 2024లో మేనిఫోస్టోలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరువేరుస్తానన్నారు. టీడీపీ ఎన్నికల సమయంలో హామీలివ్వడం గెలిచిన తరువాత మరువడం గతంలో చూశామన్నారు. ప్రతిపక్షాలు ఇళ్ల వద్దకు వచ్చి మోస మాటలు చెబుతున్నారన్నారు. చంద్రబాబునాయుడు దొంగ హామీలను, జగనన్న ప్రభుత్వంపై చేసే తప్పుడు ప్రచారాలను ఎట్టి పరిస్థుతుల్లో రాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా చూస్తూ ముందుకు సాగుతున్న జగనన్నలాంటి నాయకుడు దేశంలోనే లేడన్నారు. ఫ్యాన్ గుర్తుకు మరోమారు ఓటు వేసి ప్రతిపక్షాలకు బుద్ధి చెబుదామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ రాష్ట్ర డెరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, వైస్ ఎంపీపీ మల్లేశ్వరయ్య, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, మొరుసు రమణారెడ్డి, సంజీవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజు, నారాయణ, శివయ్య, ఎలపనాయుడు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కాలనీలో ప్రచారం


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రిరూరల్: పట్టణంలోని సీపీఐ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబయ్య శనివారం ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందచేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం


వృద్ధుడిని ఓటు అడుగుతున్న సాయి అర్చితరెడ్డి


ఓటు అభ్యర్థిస్తున్న మౌన అమృతరెడ్డి

తాడిపత్రిరూరల్: వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కోడలు సాయి అర్చితరెడ్డి అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో శనివారం ఆమె ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. తాడిపత్రిలో అభివృద్ధి ఎమ్మెల్యే పెద్దారెడ్డితో సాధ్యమవుతుందన్నారు. అలాగే పట్టణంలోని హరిజనవాడలో ఎమ్మెల్యే కోడలు మౌన అమృతరెడ్డి ప్రచారం చేశారు. సంక్షేమం పథకాలు అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆమె కోరారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


గన్నెవారిపల్లి కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రి: ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించడం ద్వారా మరోమారు జగనన్నను సీఎం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన తాడిపత్రి రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న పదవి అలంకరించాలంటే తాడిపత్రి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలని, అలాగే ఎంపీగా శంకర్‌నారాయణను గెలిపించుకోవాల్సిన బాధ్యత తాడిపత్రి ఓటర్లపై ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆయన కోరారు.